# అసంపూర్ణ చిత్రం

వర్షంపడి వెలిసింది....

పెరట్లోని ఎఱ్ఱ తురాయి చెట్టుమీది పూలన్నీ రాలి భూమ్మీద పరుచు కున్నాయి.... రక్తసిక్తమైన యుద్ధక్షేత్రంలా ఆ పూలతో ఎఱ్ఱగా ఉందా ప్రదేశం.

నాకా పూలంటే చాలా ఇష్టం!

ఆ ఇష్టం ఏర్పడడానికి కారణం... ప్రమద!! ఆ చెట్టుకిందికి నడు స్తుంటే మట్టివాసనేసింది. ఇప్పుడిప్పుడే సూరీడు బయటకొస్తుంటే లేత ఎండ కాస్తోంది. తురాయి పూలన్నింటినీ ఏరి అందంగా 'ఆమె' పేరులా అమర్చాను.

ప్రమద.

కుంకుమతో ముగ్గేసినట్టుగా ఉందా పేరు. ఆ పేరుని చూస్తూ అలాగే కూచుండిపోయాను. సిటీలో బోర్ కొట్టిన రెండేళ్ళకు మళ్ళీ మావూరు... మా ఇల్లు.... పెరట్లో ఎఱ్ఱతురాయి చెట్టు... ప్రమద పరిచయం ఆ చెట్టు కిందే.

మొదటిసారి అక్కయ్యవాళ్ళింట్లో ప్రమద వాళ్ళ కుటుంబం దిగి నప్పుడు చూసింది మొదలు... అవే జ్ఞాపకాలు.

ఆరోజు ఇలాగే వర్షం పడింది. పూలన్నింటినీ ప్రమద అన్న అక్ష రాలుగా అందంగా పేర్చి...మైమరిచి చూస్తున్నాను. ఒక్కసారిగా నామీదే

వర్షం కురిస్తే చప్పున లేచి ఇంట్లోకి పరిగెత్తబోయాను. అప్పుడు విన్పిం చింది, కోయిల గొంతుకు తేనె రాసుకున్నంత తియ్యటి నవ్వు....చెట్టు కొమ్మను ఊపుతూ కిలకిలా నవ్వుతోంది ప్రమద. నిజానికి వర్షంపడట్లేదు. ఆమె ఊపుతోన్న కొమ్మ ఆకులమీది నీటి బిందువులు జల్లులా రాలిపడు తున్నాయి.

'నా పేరు నీకెలా తెల్సు?' అధికారికంగా అడిగినట్టుందామాట. నిజంగా మొదటిసారి భయపడ్డాను. ఈ విషయం అక్కకి చెపితే. నే మాట్లాడలేదు.

"మీ అక్కయ్యకేం చెప్పనుగాని.... నువ్వింత మంచి ఆర్టిస్టువని ఈ వారం రోజుల్నుంచీ తెలీదు. నిన్న నువ్వు కాలేజీకెళ్ళాక మీఅక్కయ్య నువ్వేసిన బొమ్మలు చూపించింది. నిజం మునీ....ఇప్పుడు పూలతో పేర్చిన నా పేరుని చూస్తుంటే...'

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. అందమైన ఆమె ముఖం ఆనందంగా వెలిగిపోతుంది. ఆ వెలుగులో ఆ ముఖంలోని ఎరుపుదనానికి ఎర్రతురాయి పువ్వు కూడా సిగ్గుపడుతుందేమో? ఆమె తనపేరు ముందు మోకాళ్ళమీద కూచుంది. ఆ పూలను దోసిళ్ళలో తీసి...

'అనంతంలోకి తలెత్తి చూడు... ఆకాశం సిగలో ఏడురంగుల దండల్ని తురుముకుంటుంది. చింత చెట్టుమీది కోయిల చిగురు వరకు మత్తుగా పాడుతోంది. మన కలయిక తుషార సమీరంలో వసంతాగమనం కావాలి. మన స్నేహం ఎర్రతురాయి రేఖల్లో ముడుచుకు పడుకున్న ఆరుద్ర పురుగులా కల్సిపోవాలి...' అంటూ ఆ పూలు నానెత్తిన గుమ్మరించి కుచ్చి ళ్లను పైకెత్తి ఇంట్లోకి పరిగెత్తింది.

నేను బిత్తరపోయి అలాగే అదే చెట్టుకింద... గంటసేపు కూచు న్నాను. అక్కయ్య అన్నానికి పిలిచేంత వరకూ.

అలా మొదలైంది ప్రమద పరిచయం. రోజూ అదే చెట్టుకింద కూచునేవాళ్ళం. నాకు దగ్గరగా జరిగి కూచునేది. నేను దూరంగా ఉన్న

గుమ్మంవైపు భయంగా చూస్తూనే బొతాఖానీ వేసేవాడిని.

చాలా కబుర్లు చెప్పేది. ప్రకృతిలోని రంగుల గురించి చెప్పేది. నువ్వు రవివర్మ అంతటి గొప్పవాడివి కావాలి అనేది. అతనెవరని నేనడిగితే నవ్వేది.

'మునీ అన్న పేరు నీకు సార్థకమే' అంది.

'ఎందుకు?' అన్నాను.

'మునీ అని పిలిచినా....బుద్ధూ అని పిలిచినా తేడా లేదుకదా' అంది మరింత దగ్గరగా జరుగుతూ... నాకేం అర్థంకాక 'అదేం ఎందుకని' అని అడిగాను.

'ఎన్టీఆర్ విశ్వామిత్ర విడుదలయ్యాక చూడు.... ముక్కు మూసుకొని తపస్సు చేసుకొనే ముని కూడా, మేనకొచ్చి పక్కన కూచోగానే రెచ్చిపోతాడట.'

నాకర్థమైన మరుక్షణం .... నరాల్లో ఉత్తుంగ తరంగాలు .... బిడియంగా చూసాను.

'అమావాస్య వెళ్ళిన మూడోరోజు ఆకాశంలో పొడిచే 'నెల పొడుపు'ని చూసి శుభసూచకంగా నీ మొహాన్ని మీ ఇంట్లోవైను కట్టి చూస్తారుకదా' అంది.

'అవునూ' అన్నాను.

'ఈరోజు నెలపొడుపు. నువ్వు కళ్ళుమూసుకో... నే చూస్తాను' అంది అధికారికంగా. నా చెక్కిళ్ళు ఆమె చేతుల్లోకి వెళ్ళినప్పుడు గబుక్కున కళ్ళు తెరిచాను, చిలిపిగా నవ్వుతున్న ఆమెకళ్ళు నాకు అత్యంత సన్నిహితంగా.

'మునీ...'

ఇంట్లోంచి అక్కయ్య కేకకు క్షణంలో మాయమయ్యాను అక్కడి నుంచి. ఆరోజు రాత్రి నాకు నిద్రలేదు. ఆరాత్రి బ్రష్ తీసుకొని ఆమె బొమ్మగీయాలని ప్రయత్నించాను. సగం గీసానో లేదో....గుండెను పిడి

కిళ్ళ మధ్య ఎవరో పిసికినంత బాధేసింది. కడుపులో పేగులు నులిపెట్టి నట్లయింది. కళ్ళు మూతలు పడ్డంత నిద్ర ముంచుకొచ్చింది. ఆ స్థితి ఎందుకు కలిగిందో అర్థంకాలేదు. ఆ చిత్రం ఇప్పటికీ అసంపూర్ణంగానే వుంది.

మర్నాడు ప్రమద నాగదిలోకొచ్చింది నేరుగా...వస్తూనే.

'ఆటోగ్రాఫ్ ఇవ్వవా?' అంది.

ఆమె చేతిలోని ఆటోగ్రాఫ్ పుస్తకాన్ని తీసుకొని అందులో చక్కని కొటేషన్ రాయడానికి పెన్ తీసాను.

"ఇవ్వవా అన్నాను... రాయవా అన్లేదు" చిరుకోపంగా అంది.

ఇంకెలా ఇవ్వటం? అయోమయంగా అడిగాను. అప్పుడు చప్పున నా కుడిచేతిని తీసుకొని పెదాలతో గట్టిగా ముద్దెట్టుకుంది. హృదికవాటాలు. నిశ్శబ్దాన్ని సంతరించుకున్నాయి. నా పెదవులు చిగురుటాకులా రెపరెప లాడాయి. అర నిమిషం తర్వాత నా చేతిని విడిచిపెడుతూ 'ఇలా' అంది

నాలుగో క్షణాన నాలుగు పెదాల సంగమం...

"నువ్వంటే నాకిష్టం... ఎందుకో తెలీదు" ముద్దముద్దగా అంది. అప్పుడే గిటార్ మ్యూజిక్ విన్పిస్తే తలతిప్పి అటు చూసాం. నా ఫ్రెండ్ రాజేష్ వస్తున్నాడు. వాడు గొప్పగా పాడగలడు. ప్రమదని చూపి గది బయటే ఆగిపోతే పిల్చాను. ప్రమదకు వాడిని సింగర్‌గా పరిచయం చేయ గానే ఉత్సాహంగా ఒక పాట పాడమంది. వాడందుకున్నాడు.

"హమే తుమ్‌సే ప్యార్ కిత్‌నా..."

వాడు అద్భుతంగా పాడాడు. పాట పూర్తికాగానే ప్రమద వాడిని అభి నందనల్లో ముంచేసింది. 'ప్లీజ్' మళ్ళీ పాడండి' అంటూ బతిమాలింది. వాడు ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ప్రమద ప్రవర్తన నాకక్కడే నచ్చలేదు... మనసుకి చిన్న గాయం తగిలిన బాధ.

వాడు ఈసారి తమిళ గీతం పాడాడు. "చిలువిన ముద్దిన ముక్కలే.. ముక్కలే..." అది తనకర్థంకాలేదని మరో తెలుగుపాట పాడించుకుంది.

ఆ గదిలో మూడో వ్యక్తిని నేనున్నట్టే వాళ్ళు మర్చిపోయారు.

రాజేష్ వెళ్తుంటే వాడితో మాట్లాడుతూ ప్రమదకూడా వెళ్ళింది. వెళ్తూవెళ్తూ కనీసం నావైపుకూడా చూళ్ళేదు. నామనసు చివుక్కుమంది.

చాలా సేపు మౌనంగా కూచున్నాను. ఆ అసంపూర్ణ చిత్రాన్ని పూర్తి చెయ్యాలనుకున్నాను. పూహూ – అస్సలు సాధ్యపడలేదు.

తర్వాత మూడురోజులు ప్రమద నా గదివైపు రాలేదు. రాజేష్ హోటల్లో కలిసాడు. చాలా ఉత్సాహంగా ఉన్నాడు. టీ సిప్ చేస్తూ "నేనా అమ్మాయిని ఇష్టపడుతున్నాన్రా" అన్నాడు. చెంప మీద చాచికొట్టాలనిపించింది. నా దగ్గర అంత ధైర్యం లేదని నాకు తెలుసు.

బాధపడ్డాను... ఆరోజంతా!

నాలుగో రోజు ప్రమద నాగదికొచ్చింది.

బావున్నారా? గొంతులో అదే మాధుర్యం.

బావ లేరు... ఆఫీసుకెళ్లారు. కోపంగానే అన్నట్టున్నాను.

'పర్లేదు. నువ్వుకూడా జోకులేస్తావే? నువ్వు బాగున్నావా అని అడుగుతున్నాను. ఏమ్... నా మీద కోపమొచ్చిందా?' చాలా ప్రేమగా అడిగింది.

నా కనురెప్పలు గనుక పైకెత్తితే కన్నీటి తెరలమీద ఆమె ప్రతిబింబాన్ని చూసుకునేదేమో... నేను చాలా జాగ్రత్తపడ్డాను.

"నువ్వీ మధ్య బొమ్మలు వేయట్లేదు కదూ. బొమ్మలు వేయకపోతే నీతో ఫ్రెండ్‌షిప్ కట్ చేస్తాను." చిరుకోపంతో నా చుబుకాన్ని పైకెత్తి అంది. అప్పటికప్పుడు విశ్వప్రపంచాన్ని ఆ కుంచెతో కుదించాలన్న కుతూహలం కలిగింది.

తప్పకుండా గీస్తాను. అన్నాను. ఆమెమీద కోపం ఎగిరిపోయింది. అన్నట్టు నీకో విషయం తెల్సా.... సుధాకర్‌గారని గొప్పరచయిత. ఆయన ఈ వూర్లోనే ఉంటున్నారు. నిన్న కళాభారతిలో అనుకోకుండా పరిచయం అయ్యారు. ఎంత బాగా మాట్లాడాడో తెల్సా. ఆయన కథలు గొప్పగా వుంటాయి. ఆయన రాసిన నవలల్లో 'నువ్వంటే ప్రాణం' ఎంత బావుందో?

నిన్న ఆయనింటికి రమ్మన్నారు. వెళ్ళానుకూడా. ఓ సీరియల్‌కు వేస్తున్న ముఖాముఖిలో నా పేరుమీద ఆయనే ప్రశ్నరాసి జవాబు కూడా రాసుకున్నారు. ఇప్పుడు రాయబోయే నవల్లో ఒకపాత్రకు మంచి పేరు పెట్టాలని రెండు రాత్రుల్నుంచి నిద్రలేకుండా ఆలోచిస్తున్నారట. నా పేరు బావుందని నా పేరు పెడుతున్నారు ఆ పాత్రకి. పాపం ఇంత చిన్నవయసులోనే ఆయన గారి భార్య చనిపోతే మళ్ళీ పెళ్ళికూడా చేసుకోలేదట.

ప్రమద చెప్పుకుంటూ పోతూనే ఉంది. ప్రమద మనస్తత్వమే నాకర్థం కాలేదు. నేను మౌనంగా ఉండిపోయాను. అసలు తప్పంతా ఎక్కడ ఉంది?

కొంచెం ప్రేమగా ...కొంత ఆలంబనగా...కొండంత ప్రోత్సాహకంగా మాట్లాడగానే ఏవో ఊహించుకుంటోన్న నాలో, రాజేష్‌లోనే వుందా? మర్నాడు నేనూ, రాజేష్ జగిత్యాల పాత బస్టాండ్‌లోంచి వెళ్తున్నాం. రాజేష్ ఈ మధ్య నిరుత్సాహంగా వుండటం నేను అబ్జర్వ్‌చేసాను. ప్రమద నన్నూ, వాడిని కలుపక వారం దాటివుంటుంది. నాలో నాకే నవ్వొచ్చింది. సరిగ్గా అప్పుడే మా పక్కనించి ప్రమద వెళ్ళింది. ఆమె పక్కన రచయిత సుధాకర్! వాళ్ళేదో సబ్జెక్టు గురించి చర్చించుకుంటూ వెళ్తున్నారు. ప్రమద నన్ను చూసినా చూడనట్టే దాటుకుంటూ వెళ్ళింది. అది నేను గమనించాను.

గుండె కండరాల్ని ఆమె కొనగోటితో చిదిపినంత బాధ కలిగింది. వాళ్ళు దూరంకాగానే రాజేష్ ఏదో తిట్టాడు. ఇంటికి వెళ్ళిన నాకు జె.ఎన్.టి.యు. హైదరాబాద్‌లో ఫైన్ ఆర్ట్స్ కోర్సులో సీటొచ్చినట్టు లెటరుంది.

'య్యాహూ' అని అరిచాను. ఇల్లంతా గంతులేసాను. ఆనందం పట్టలేక అదిపట్టుకొని ప్రమద దగ్గరకు పరిగెత్తాను.

పరుగు...పరుగు...పరుగు...

వొగరుస్తూనే చెప్పాను. ప్రమదా నాకు ఫైన్ ఆర్ట్సులో సీటొచ్చింది. అప్పుడామె కెదురుగా రైటర్ సుధాకర్ కూచొని వున్నాడు. ఆయన కాస్తచిరాగ్గా మొహం పెట్టాడు. ప్రమద నన్ను అభినందిస్తుందనిచూసాను.

"అచ్ఛా" అంది చాలా నిర్లిప్తంగా.

ఎగిసిపడుతున్న నా ఛాతిలోంచి కన్నీళ్లు విసిరేయబడుతున్నాయేమో.. రెప్పలమాటునే వాటిని అణిచి పెట్టి ఈరోజు వెళుతున్నాను ప్రమదాఅన్నాను గాబరాతో.

పెదాలు కొంచెం బిగపట్టి కళ్ళు నిశ్శబ్దంగా పైకెత్తి ఏకాంతీలేని చూపుల్తో అలాగా... వెళ్లు అంది అతి మామూలుగా. ఆ మాట కన్నా కొరడాదెబ్బ నయమేమో?

నేను వెనక్కి తిరిగాను. అన్ని రంగుల్ని పరుసగా పెట్టి జీవి తాన్ని ఇంద్రధనుస్సులా పరుస్తుందనుకున్న ఆమె... అన్ని రంగుల్ని కల గలిపి నల్లరంగులా తయారుచేసిన ఆమె పట్ల బాధ, కోపం కలిగాయి. మనసు కుంచెలో ఆమె బొమ్మను చెరిపేస్తూ కదిలాను.

హైదరాబాద్ బస్సెక్కాను. అయినా కళ్లు ఎవ్వరికోసమో వెతుకు తాయి. ఆ బాధ చాలా దుర్భరమైంది. బస్సుకదిలింది. ప్రయాణంలో గదిలోగీసిన అసంపూర్ణ చిత్రమే గుర్తొస్తుంది. కాలం వెలిసి పోతూనే ఉంది. ఫైన్ ఆర్ట్స కోర్సుకు వెళ్లిన నేను రెండేళ్లయినా తిరిగి జగిత్యాల రాలేదు. ప్రమద ఆలోచనలు మొదట్లో వుండేవి. కాలంతో పాటు అణగారి పోయాయి. ప్రస్తుతం ఒక వీక్లీలో ఆర్టిస్ట్‌గా పార్ట్‌టైం ఉద్యోగం సంపా దించుకున్నాను.

ఓరోజు మా వీక్లీకి రైటర్ సుధాకర్ వచ్చాడు. అతడు రాగానే మా ఎడిటర్ ఫైలు అతడి ముందుంచుతూ...

"సారీ సుధాకర్‌గారు... కళాహృదయమున్న ఒకమ్మాయి ఎప్పుడు ఏ కళలపట్ల ఆకర్షితురాలై ఆ కళాకారుల్ని అభిమానించినట్టు, ప్రేమించి

నట్టు నటించి.... చిచ్చురేపినా.... అలాంటి ఆడవాళ్ల మనస్తత్వాన్ని రక రకాలుగా అంచనా వేస్తూ రాయటం బాగానే ఉంది కాని... మీరు బుచ్చిబాబు, మెరుపుల మరక, తల్లావఝుల సుందరం, వెన్నెల మరక, చదవలేదా జస్ట్ ఇలాంటివే. ఇదిగాక క్రొత్త సబ్జెక్ట్ ఏదైనా ట్రై చెయ్యండి అన్నాడు ఎడిటర్. కాని ఇది నాలైఫ్ సార్. ఈ నవల రాయడానికి ఓ అమ్మాయి కారణం" చెప్పాడు సుధాకర్ గొంతు గాద్గికంగా చేసి

"ఎవరా అమ్మాయి?"

"ప్రమద"

వాళ్ల మాటలు వింటున్న నేను ఉలిక్కిపడ్డాను. ప్రమద! ప్రమద!! ప్రమద!!! నా కళ్లల్లో ఎర్రతురాయి చెట్టు కదలాడింది.

"ఇన్‌స్పిరేషన్ ఎవరైనా కావచ్చు. కాని ప్రస్తుతం ఇలాంటివి సీరియల్‌గా పనికిరావు" అన్నాడు ఎడిటర్ నిష్కర్షగా.

సుధాకర్ ఫైల్ తీసుకొని వెనుదిరిగిపోతుంటే.... 'సార్' అని పిలిచాను. 'ఏమిటన్నట్టు'గా ఆగిపోయాడాయన.

'ప్రమద ఇప్పుడెక్కడుంది?'

నాలోని ఉత్సుకతకి ఆయన కొంచెం ఆశ్చర్యంగా చూసాడు. ఆ తర్వాత కళ్లల్లో కసి నింపుకొని....

"ఓ బిజినెస్ మాగ్నెట్‌ను బుట్టలో వేసుకొని... పెళ్లయ్యాక అమెరికా వెళ్లిపోయింది" అనేసి గబగబా వెళ్లిపోయాడాయన.

నేను స్టన్ అయ్యాను. ఆలోచనల్లో పడి.... ఓ కథకు బొమ్మ వేసేటప్పుడు అందులో ప్రమదను దింపాలని ఎంత ప్రయత్నించినా.... అదీ అసంపూర్ణ చిత్రంగానే మిగిలిపోయింది.

అందుకే ప్రమద నాకెప్పుడూ ప్రశ్నార్థకమే...

? ? ? ? ?

★